క్లుప్తంగా

మంత్రికి ఆహ్వానం



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

పలమనేరు: జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులుతో కలసి స్థానిక ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డి, పట్టణ మాజీ కన్వీనర్ మండీసుధా సోమవారం రాష్ట్ర అటవీ, పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ, విద్యుత్ భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 16న పలమనేరు మున్సిపాలిటీలో నిర్వహించనున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆహ్వానించినట్లు వారు తెలిపారు.

సీసీ రోడ్డుకు భూమి పూజ



భూమిపూజ చేస్తున్న అమరనాథ్, నరేంద్ర

వి.కోట: మండలంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో అభివృద్ధి పనులు శరవేగంగా చేస్తున్నట్టు జిల్లా సాంఘిక సంక్షేమ సామాజిక సేవా సలహాదారుడు అమరనాథ్ పేర్కొన్నారు. సోమవారం నెర్నిపల్లె పంచాయతీ మిట్టూరులో రూ.15 లక్షల జెడ్పీ నిధులతో మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణానికి ఆయన భూమిపూజ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు నరేంద్ర, ఎంపీటీసీ, కన్వీనర్ మూర్తి, వార్డు సభ్యులు నాయకులు పాల్గొన్నారు.

చెడుపై విజయమే దీపావళి

కుప్పం రూరల్: చెడుపై మంచి విజయం సాధించడమే దీపావళి పండుగకు మూలమని ప్రబోధానంద సేవాసమితి కుప్పం ప్రతినిధి కృష్ణ అన్నారు. ప్రబోధానంద విరచిత త్రైత సిద్ధాంత భగవద్గీతపై సోమవారం మండలంలోని యనమనాశనపల్లె, సలార్లపల్లె, గొల్లపల్లెలో ప్రచారం నిర్వహించారు. కృష్ణ మాట్లాడుతూ, నరకాసురుని సంహారంతో దుష్టుని నుంచి విముక్తి కలిగిందనడానికి నిదర్శనంగా దీపావళి జరుపుకుంటున్నట్లు ఆయన వివరించారు. అలాగే పుస్తక పఠనంతో జ్ఞానం, క్రమశిక్షణ, మంచి అలవాట్లు అలవడుతాయని చెప్పారు. ప్రతి ఒక్కరు భగవద్గీత చదవాలని కోరారు. కార్యక్రమంలో నాగరాజు, కృష్ణ, చరణ్, పూజ, లక్ష్మి పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్



పోలీసుల అదుపులో జూదరులు

సదుం: జూదమాతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ మారుతి ఆదివారం తెలిపారు. చెరుకువారిపల్లె సమీపంలోని సంతతోపులో పేకాట ఆడుతున్నట్టు సమాచారం అందడంతో ఎస్‌ఐ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.9,220 స్వాధీనం చేసుకున్నారు.

గిరిజన స్వాభిమాన ఉత్సవాలు రేపు

రామకుప్పం: స్థానిక డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో బుధవారం ఉదయం 10 గంటలకు గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గిరిజన స్వాభిమాన ఉత్సవాలు నిర్వహించనున్నట్టు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ విజయలాపురం బాబురెడ్డి సోమవారం తెలిపారు. ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి పాల్గొంటారని, గిరిజన కుటుంబాలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అలాగే వారు ఏదైనా సమస్యలున్నట్లయితే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లవచ్చన్నారు.

పురవీధుల్లో వేణుగోపాలుడి కటాక్షం



కార్వేటినగరం: నగరం ప్రసిద్ధి శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో దీపావళి ఆస్థాన వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామున స్వామివారిని వేదపండితులు సుప్రభాత సేవతో మేల్కొలిపి స్వామివారి మూల విరాట్‌కు అర్చనలు అభిషేకాలు చేపట్టారు. అనంతరం వేద పండితులు స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ఆలయ ఆవరణలోని ఊంజల్ మండపం వద్ద వేంచేపు చేవారు. అనంతరం వేద మంత్రాలు పఠిస్తూ దీపావళి ఆస్థాన వేడుకలను వైభవంగా నిర్వహించారు. తరువాత ఉత్సవమూర్తులను పట్టు వస్త్ర, సుగంధభరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై ప్రతిష్ఠించి పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు ఇంటింటా కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

శాస్త్రోక్తంగా గౌరీవ్రతం



గంగవరం: గౌరీ వ్రతమాచరిస్తున్న మహిళలు



పలమనేరు: ప్రత్యేక అలంకరణలో గౌరీదేవి

దీపావళి పండుగ పురస్కరించుకుని పలమనేరు, పుంగనూరు, కుప్పం నియోజకవర్గాల వ్యాప్తంగా ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఆలయాల్లో మహిళా భక్తులతో అర్చకులు కౌదార గౌరీ వ్రతం చేయించారు. దీపావళి పండుగ విశిష్టత, వ్రత ప్రాశస్త్యాన్ని వివరించారు.

పలమనేరు: పలమనేరు మున్సిపాలిటీ, మండల వ్యాప్తంగా దీపావళి పండుగను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని శివాలయం, వెంకటేశ్వరాలయం, వినాయకుని గుడి, గంగమ్మ, మారెమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక కాశీవిశ్వేశ్వరాలయంలో మహిళలు కేదారి గౌరీ నోముల వ్రతమాచరించారు. గౌరి కథతో పాటు దీపావళి ప్రాశస్త్యాన్ని అర్చకులు, పెద్దలు వివరించారు. కొందరు దసరాను సైతం దీపావళితో పాటే నిర్వహించారు. గడ్డూరు, గంటావూరు, పాతపేటలోని పలు ఆలయాల్లో గౌరీదేవిని ప్రత్యేక అలంకారంతో ఏర్పాటు చేసి నోములు తీర్చుకున్నారు. పండుగ సందర్భంగా టపాకాయల ధరలకు రెక్కలొచ్చాయి. పొరుగునే ఉన్న తమిళనాడులో ధరలు తక్కువగా ఉండడంతో పలువురు అక్కడినుంచి టపాకాయలు తెచ్చుకున్నారు.

గంగవరంలో...

గంగవరం: మండలవ్యాప్తంగా దీపావళి పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పలు ఆలయాల వద్ద పసుపు, కుంకుమ, కలశాలతో గౌరీ అమ్మవారి ప్రతిమను కొలువుదీర్చి ఘనంగా పూజలు చేశారు. మహిళలు ఉపవాస దీక్షలతో ఆలయాల వద్ద గౌరీ అమ్మవారి వ్రతమాచరించారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: దీపాల కాంతులు, బాణసంచా మెరుపులతో ఆదివారం రాత్రి మండలంలో సందడి నెలకొంది. గ్రామాల్లో పెద్ద ఎత్తున బాణ సంచా కాల్చి యువకులు, పిల్లలు కేరింతలు కొట్టారు. దుకాణదారులు, రాజస్థానీలు లక్ష్మీదేవి చిత్రపటాలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. తమ జీవితాల్లో చీకట్లు తొలగిపోయి వెలుగులు నిండాలని ప్రార్థించారు. నరక చతుర్దశి మరుసటి రోజున కేదార గౌరి చెన్నారెడ్డిపల్లె చెరువు కట్టపై ఉన్న శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో పూజారి హరీష్ అధ్వర్యంలో మహిళలు సామూహిక వ్రత పూజలు చేశారు. అర్చకులు కేదార గౌరి ప్రాశస్త్యం, వ్రతవిధానాన్ని వివరించారు. తదుపరి ఇళ్లలో గౌరమ్మను నెలకొల్పి పూజలు నిర్వహించారు. నోము దారాలు ధరించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం ఇంటి ముంగిట రంగురంగుల ముగ్గులు వేసి దీపాలు వెలిగించడంతో పల్లెలు దీపాల కాంతులతో కొత్త శోభను సంతరించుకున్నాయి.

బైరెడ్డిపల్లెలో...

బైరెడ్డిపల్లె: మండల వ్యాప్తంగా రైతులు దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలు గృహాల్లో గౌరీదేవి అమ్మవారిని కొలువుదీర్చి కేదారేశ్వరస్వామి వ్రతమాచరించారు. వాహనాలను వివిధ రకాల పుష్పాలతో అలంకరించి ఆయుధ పూజలు చేశారు.

సదుం: స్థానిక వీరభద్ర, అరుణాచలేశ్వరస్వామి, మత్తుకువారిపల్లె మల్లేశ్వరస్వామి ఆలయాల్లో సోమవారం కేదారేశ్వరస్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించారు. అమావాస్య నోముల పండుగ సందర్భంగా భక్తులు పాల్గొన్నారు. వ్రతకల్ప విశిష్టతను ఆలయ అర్చకులు భక్తులకు తెలియజేశారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: దీపావళి పండుగ సందర్భంగా రొంపిచెర్ల సమీపంలోని కట్టకింద శివాలయంలో నోముల పండుగను సోమవారం ఘనంగా నిర్వహించారు. అమావాస్య రోజున నోముల పండుగను ప్రారంభించి ఐదు వారాల పాటు ప్రతి సోమవారం పండుగను నిర్వహిస్తారు. ఆలయ అర్చకులు మునిరాజ శర్మ గౌరీదేవి కథ చదివి పూజలు చేశారు. భక్తులు టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.



పలమనేరు: కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో..







పెద్దపంజాణి: కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో.., బైరెడ్డిపల్లె: దీపావళి సంబరాలు చేసుకుంటున్న స్థానికులు, సదుం: వ్రతమాచరిస్తున్న భక్తులు

ఘనంగా ఎమ్మెల్సీ జన్మదిన వేడుకలు





గుడుపల్లె : తన సతీమణి దుర్గతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ భరత్, రామకుప్పంలో..

కుప్పం/గుడుపల్లె/రామకుప్పం/బైరెడ్డిపల్లె: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, చిత్తూరు ఎమ్మెల్యే కేఆర్‌జే భరత్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కుప్పంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, గుడుపల్లెలో ఎమ్మెల్సీ సతీమణి దుర్గ, రామకుప్పంలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, బైరెడ్డిపల్లెలో రాజంపేట వైఎస్సార్‌సీపీ ఎన్నికల పరిశీలకులు బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి, ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప ఆధ్వర్యంలో కోలాహలంగా వేడుకలు నిర్వహించారు. అలాగే అన్నదానం చేశారు. రామకుప్పం జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, పార్టీ మండల కో–కన్వీనర్ చంద్రారెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, పార్టీ టౌన్ అధ్యక్షుడు అప్పి,మాజీ జెడ్పీటీసీ ఆరేళ్ల జయప్ప, బైరెడ్డిపల్లె మండల సర్పంచులు వెంకటేష్, చంద్రమౌళి, వైస్ సర్పంచ్ తబ్రాజ్, వైఎస్సార్ సీపీ నేతలు చంద్రశేఖర్, షాకీర్, పీరూసాబ్, మహేష్, ప్రసాద్, ఎంపీటీసీలు, సర్పంచులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

నేడు కేంద్ర బృందం పర్యటన

సదుం: మండలంలో కేంద్ర బృందం మంగళవారం పర్యటిస్తుందని ఎంపీడీఓ వరప్రసాద్ తెలిపారు. పర్యటనలో భాగంగా ఎర్రాతివారి పల్లెలో నాడు–నేడు, సచివాలయ వ్యవస్థ, హౌసింగ్, సంక్షేమ పథకాల అమలును పరిశీలిస్తారని చెప్పారు. ఉదయం 10. 30 నుంచి మధ్యాహ్నం1.30 గంటల వరకు పర్యటన కొనసాగుతుందన్నారు.

సోమలలో..

సోమల: మండలంలో కేంద్ర బృందం మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటలకు పర్యటిస్తుందని ఎంపీడీఓ నాగరాజు తెలిపారు. పంచాయతీ పరిధిలో ఐసీడీఎస్, ఉపాధి, సచివాలయ వ్యవస్థ, సంక్షేమ పథకాల అమలును పరిశీలిస్తారని చెప్పారు.

పలమనేరులో ఎమ్మెల్యే..

పలమనేరు: పట్టణంలోని కొత్తపేట సచివాలయ పరిధిలో మంగళవారం ఉదయం 9.30 గంటలకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ పాల్గొననున్నట్టు ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పార్టీ శ్రేణులు ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

రోడ్డు పనులు ప్రారంభం



చిత్తూరు కలెక్టరేట్ వద్ద చేస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులు

చిత్తూరు కార్పొరేషన్: జాతీయ రహదారి–4లో భాగంగా బంగారుపాళ్యంలోని నలగాంపల్లె నుంచి తమిళనాడు సరిహద్దు వరకు పెండింగ్‌లో ఉన్న రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. తిరుపతిలోని ఎన్‌హెచ్‌ఏఐ పీడీ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో పనులు చేస్తున్నారు. చిత్తూరులోని కలెక్టరేట్ వద్ద పనులను రెండు రోజుల క్రితం ప్రారంభించారు. చెన్నై–బెంగళూరు హైవే విస్తరణ మార్గంలో తమిళనాడు సరిహద్దు నుంచి కర్ణాటక సరిహద్దు వరకు జిల్లా మీదుగా ఈ రోడ్డు పనుల్ని రెండు ప్రాజెక్టులో మొదలెట్టారు. గతంలో కాంట్రాక్టరు పనులు సక్రమంగా చేయలేదు. దీంతో కొన్ని మార్పులు చేసి, మళ్లీ టెండర్లను పిలిచి, మరో కాంట్రాక్టర్‌కు పనులను అప్పగించారు. మూడు వంతెనలను రూ.100 కోట్ల అంచనాతో నిర్మించనున్నారు. చిత్తూరులోని కలెక్టరేట్, గుడిపాల మండలం చీలాపల్లె సీఎంసీ ఆస్పత్రి, తమిళనాడు సరిహద్దులో బ్రిడ్జిలను నిర్మించడంతో పాటు రోడ్డు విస్తరణ పనులు చేయనున్నారు. చిత్తూరులో బ్రిడ్జి నిర్మాణానికి పిల్లర్లను నిర్మిస్తున్నారు. దీనికి అనుసంధానమైన సర్వీసు రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ పనులు పూర్తయితే వాహనదారులకు అవస్థలు తొలగనున్నాయి.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



సంక్షేమ పథకాలు వివరిస్తున్న నాయకులు

సదుం: అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాల ఫలాలు అందిస్తున్నామని, గత ప్రభుత్వ పాలనలో కేవలం నాయకులు, కార్యకర్తలకే అందేవని సర్పంచ్ ఉషారాణి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని బలిజవీధి, రేగల్‌రోడ్డులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, గత ప్రభుత్వం అమలు చేయని హామీలను వివరించారు. దీనిని దృష్టిలో ఉంచుకుని మరోసారి వైఎస్సార్ సీపీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కాలేషా, మునాఫ్, షాహిదా, మస్తాన్, ఆంజనేయులు, బీఎల్‌ఓ బావాజి పాల్గొన్నారు.

‘భవిత’ విద్యార్థులకు పుస్తకాలు, రైటింగ్ ప్యాడ్లు



పుంగనూరు: స్థానిక భవిత కేంద్రంలో సోమవారం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు త్రిమూర్తిరెడ్డి, సభ్యులు ప్రపంచ దయ దినోత్సవం నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులకు రూ.5 వేల విలువ చేసే పుస్తకాలు, పెన్నులు, రైటింగ్ ప్యాడ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. క్లబ్ ప్రతినిధులు మహిపాల్‌రెడ్డి, రఘునాథరెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్ బాల్ విజేత పెద్ద వెలగటూరు



హ్యాండ్ బాల్ క్రీడాకారులతో ఉపాధ్యాయులు

పెద్దపంజాణి: పుంగనూరు జోనల్ క్రీడల్లో భాగంగా ఇటీవల పెద్ద వెలగటూరు జెడ్పీ హైస్కూలు క్రీడా మైదానంలో నిర్వహించిన సీనియర్ హ్యాండ్‌బాల్ పోటీలలో బాలుర జట్టు విజేతగా నిలిచిందని ఆ హైస్కూలు హెచ్‌ఎం రమణప్ప తెలిపారు. అలాగే, బాలికల జట్టు రన్నర్స్‌గా నిలిచిందని పేర్కొన్నారు. కోచ్ మురళీమోహన్, విజేతలను సర్పంచ్ చంద్రశేఖర్, ఎంపీటీసీ మోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

కొండమల్లీశ్వరుడికి ప్రత్యేక పూజలు



వెదురుకుప్పం: మండలంలోని డీఆర్‌ఎన్ కండ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం కొండమల్లీశ్వర స్వామివారికి పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

పలమనేరు: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో 56వ గ్రంథాలయ వారోత్సవాలు ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు స్థానిక గ్రంథాలయాధికారి హేమంత్‌కుమార్ సోమవారం తెలిపారు. ఈ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థినీ విద్యార్థులకు పలు రకాల పోటీలను నిర్వహించి బహుమతులను ఇవ్వనున్నట్లు చెప్పారు.

16న విగ్రహ ప్రతిష్ఠాపన

రొంపిచెర్ల: ఈ నెల 16న మండలంలోని జాండ్లవారిపల్లెలో ఉదయం 9 గంటలకు చీనేపల్లె యల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన చేయనున్నట్టు సర్పంచ్ దేవులపల్లె నాగిరెడ్డి సోమవారం తెలిపారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. 15న సాయంత్రం వివిధ వైదిక కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్టు చెప్పారు.

ఉలవతోటను దున్నేశాడని పోలీసులకు పిర్యాదు

పలమనేరు: తన పొలంలోని ఉలవతోటను గ్రామస్తుడు లోకనాథ రెడ్డి ట్రాక్టరుతో దున్నేశాడని, దీంతో తనకు రూ.10వేల నష్టం వాటిల్లిందని మండలంలోని కల్లాడు గ్రామానికి చెందిన సుబ్రమణ్యం రెడ్డి సోమవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన భూమిలో అక్రమంగా ప్రవేశించి అరెకరా పొలాన్ని నాశనం చేసిన నిందితునిపై చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ఎన్నో ఏళ్ల సమస్యకు పరిష్కారం



శ్మశాన వాటిక ఏర్పాటుకు పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కార్వేటినగరం: కొన్ని దశాబ్దాల కాలంగా తీరని సమస్యకు డిప్యూటీ సీఎం నారాయణస్వామి చొరవతో ఆదివారం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ పరిష్కారం చూపారు. ఈ సందర్భంగా సీకాయపట్టెడ గ్రామస్తులు మాట్లాడుతూ సుమారు ఏడు దశాబ్దాలుగా తమ గ్రామానికి శ్మశానం లేక ఇబ్బంది పడుతున్నామని, అయిన వారు చనిపోతే సొంత పొలాలు, కాలువ గట్లపై ఖననం చేసేవారమని తెలిపారు. శ్మశానం ఏర్పాటు చేయాలని అనేకమార్లు ప్రజా ప్రతినిధులకు, అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి చొరవ తీసుకుని సమస్య పరిష్కరించారని తెలిపారు. ఎన్నో ఏళ్ల సమస్యకు పరిష్కారం చూపిన ఉప ముఖ్యమంత్రి ఎప్పటికీ రుణపడి ఉంటామని కృతజ్ఞతలు తెలిపారు.

చెట్ల సంరక్షణ సామాజిక బాధ్యత



మొక్కలు నాటుతున్న కుమార్‌రాజా తదితరులు

బంగారుపాళెం: చెట్ల సంరక్షణ సామాజిక బాధ్యతని పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా అన్నారు. సోమవారం బంగారుపాళెం దళితవాడ ప్రాథమిక పాఠశాల ఆవరణలో హోమ్‌గార్డు కోదండయ్య సహకారంతో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ చెట్లు సమృద్ధిగా ఉన్న ప్రాంతాల్లో వర్షాలు సకాలంలో కురుస్తాయన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందు మొక్కలు నాటి చెట్లయ్యే వరకు వాటిని సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కామరాజు, ఎంపీటీసీ సభ్యులు ఉష, మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు చిన్నబ్బ, నాయకులు సుబ్రమణ్యం, జగదీష్, రవి పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక పుస్తకాల ఆవిష్కరణ



కల్పవృక్ష వాహన సేవలో ఆధ్యాత్మిక పుస్తకాల ఆవిష్కరణ

చంద్రగిరి (తిరుచానూరు): తిరుచానూరు పద్మావతి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన సోమవారం ఉదయం కల్పవృక్ష వాహన సేవ జరిగింది. ఈ సందర్భంగా శ్రీ వేంకటేశ్వర సుచిత్ర సుప్రభాతం (ఇంగ్లీష్, హిందీ), రామానుజ భట్టార్ రచించిన నీలమేఘశ్యాముడు, నూర్ సాగర్ పుస్తకాలను టీటీడీ జేఈవో వీరబ్రహ్మం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో గోవిందరాజన్, ప్రచురణల విభాగం ప్రత్యేకాధికారి ఆకెళ్ల విభీషణ శర్మ, ఉప సంపాదకులు నరసింహాచార్య తదితరులు పాల్గొన్నారు.

స్కంధషష్టి ఉత్సవాలు ప్రారంభం



పుష్పాలంకరణలో వల్లీదేవసేన సమేత సుబ్రమణ్య స్వామి

నగరి: పట్టణ పరిధిలోని కరకంటేశ్వర స్వామి ఆలయంలో స్కంధషష్టి ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. వారం రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా సోమవారం గణపతి పూజ, వల్లీదేవసేన సమేత సుబ్రమణ్య స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. స్వామి వారికి పుష్పాలంకరణ చేసి పూజలు నిర్వహించి ఆలయ ప్రదక్షిణ చేశారు. అనంతరం భక్తుల దర్శనార్థం ఆలయ మండపం వద్ద ఉంచారు. భక్తులు అధికసంఖ్యలో ఈ పూజలకు హాజరయ్యారు. హారతి పూజలు, ఊంజల్ సేవ నిర్వహించిన అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు ఉభయదారులకు ఆలయ మర్యాదలు చేశారు. భక్తులు ఆలయ నిర్వాహకులు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ నెల 18న సూరసంహారం, 19న కల్యాణోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం తెలిపారు.